www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 30 జూన్ 2024

వైఎస్ఆర్

వైవీయూ విసి, రిజిస్ట్రార్ రాజీనామా

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగివేమన యూనివర్సిటీ విసి ప్రొఫెసర్ చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య రాజీనామా చేశారు. ముందుగా రిజిస్ట్రార్ రాజీనామాను ఆమోదించి అనంతరం విసి ఆచార్య సుధాకర్ రాజీనామా చేశారు. ఈ సమాచారాన్ని ఉన్నత విద్యా మండలి కార్యదర్శికి పంపారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్‌గా వైవీయూ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్.రఘునాథరెడ్డి నియమిస్తూ నియామక పత్రం అందజేశారు. ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. వివిధ విశ్వవిద్యాలయాలకు డిప్యూటేషన్ పై వెళ్లిన వైవీయూ ప్రొఫెసర్లు ఇ.సి. సురేంద్రనాథ్ రెడ్డి, ఆచార్య రామచంద్రారెడ్డి శనివారం తన మాతృ సంస్థ అయిన వైవీయూలోకి వచ్చారు.

Government of Andhra Pradesh
NTR BHAROSA - PENSION DISBURSEMENT
- Through APOnline Benefit Disbursement Gateway

సామాజిక పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు

జిల్లాలోని 644 సచివాలయాలకు బాధ్యత
2.65 లక్షల మంది లబ్ధిదారుల గుర్తింపు
రేపు రూ.178 కోట్లు అందజేత

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో సామాజిక పింఛన్ల పంపిణీకి కసరత్తు ఊపందుకుంది. ప్రభుత్వం సచివాలయ కేంద్రంగా పంపిణీకి శ్రీకారం చుట్టింది. జిల్లాలోని 644 సచివాలయాల ద్వారా సోమవారం ఉదయం ఐదు గంటల నుంచి రూ.178.38 కోట్లు పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేసింది. ప్రతి సచివాలయ క్లస్టర్‌లోని ఎనిమిది మంది అధికారులకు పంపిణీ బాధ్యతలు అప్పగించారు. ప్రతి సచివాలయ అధికారి 50 మంది పింఛన్‌దారులకు నగదు అందించాలని లక్ష్యాన్ని నిర్దేశించింది. ఈలెక్కన ప్రతి సచివాలయ పరిధిలో 300 నుంచి 400 మంది పింఛన్‌దారులకు పంపిణీ చేసేలా ఏర్పాట్లు చేసింది. ఈలెక్కన జిల్లాలో 2,65,774 లక్షల మంది ఉన్నారు. వీరికి జూన్ మాసంలో వైసిపి సర్కారు రూ.3,000 చొప్పున రూ.72 కోట్లు పంపిణీ చేసిన సంగతి తెలిసిందే.

ఒకటిన రూ.ఏడు వేలు

సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో టిడిపి అధ్యక్షులు చంద్రబాబు నాయుడు నెలకు రూ.4000 చొప్పున వృద్ధాప్య పింఛన్ చెల్లిస్తామని హామీనిచ్చిన సంగతి తెలిసిందే. సార్వత్రిక ఎన్నికల ప్రచార సమయంలో టిడిపికి చెందిన ఓ సానుభూతి సంస్థ సామాజిక పింఛన్ పంపిణీ బాధ్యతల నుంచి వాలంటీర్లను తప్పించాలని కోరుతూ ఎన్నికల కమిషన్ ఆశ్రయించిందని విమర్శలు వెల్లువెత్తిన సంగతి తెలిసిందే. దీనిపై సామాజిక పింఛను పంపిణీ దారుల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. పింఛనుదారుల వ్యతిరేకతను అధిగమించడంలో భాగంగా ఏప్రిల్ నుంచి జూన్ వరకు గల మూడు మాసాలకు రూ.1,000 చొప్పున మూడు వేల రూపాయల అదనపు చెల్లింపులతో కలిపి జులై నెల రూ.4000 పింఛన్ మొత్తంతో కలిపి మొత్తం రూ.ఏడు వే లు చెల్లింపు హామీ అమలు కార్యరూపం దాల్చింది.

పోలీసుస్టేషన్లకు నగదు తరలింపు

జిల్లాలోని 644 సచివాలయాల పరిధిలోని పోలీసుస్టేషన్లకు రూ.178.38,37 కోట్ల సామాజిక పింఛన్ల నగదును తరలించారు. సచివాలయాల అధికారులు సోమవారం ఉదయం ఐదు గంటల నుంచి ఇంటింటికి వెళ్లి రూ.ఏడు వేల చొప్పున వృద్ధాప్య పింఛన్ పంపిణీ చేయనున్నారు. సదరు సామాజిక పింఛన్ల పంపిణీ వ్యవహారాన్ని ఆయా మండలాల ఎంపిడిఒలు, తాలూకాల పరిధిలోని ఆర్‌డిఒ వంటి ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తున్నారు.

పింఛన్ల పంపిణీకి సిద్ధం : కలెక్టర్

ప్రజాశక్తి - కడప

జులై 1న ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి సిద్ధంగా ఉండాలని జిల్లాలో ఎక్కడా ఎలాంటి ఇబ్బందులూ లేకుండా పంపిణీ చేయాలని కలెక్టర్ వి.విజయ్ రామరాజు అధికారులను ఆదేశించారు. శనివారం రాష్ట్ర సచివాలయం నుంచిరాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ పింఛన్ల పంపిణీ, తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కార్యక్రమానికి కడప కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి కలెక్టర్ వి.విజయ్ రామరాజు తోపాటు జెసి గణేష్ కుమార్, డిఆర్‌ఒ గంగాధర్ గౌడ్, వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు. సిఎస్ విసి ముగిసిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పథకం కింద జులై 1న పింఛన్ల పంపిణీకి అన్ని విధాలా సన్నద్ధం కావాలన్నారు. ఒకటో తేదీనే 100 శాతం పంపిణీ పూర్తి కావాలని, ఇందుకోసం అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఉదయం 6 గంటల నుంచి కచ్చితంగా పింఛన్ల పంపిణీ మొదలు కావాలన్నారు. కార్యక్రమంపై మండల ప్రత్యేక అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేయాలన్నారు. నియోజకవర్గ అధికారులు పెన్షన్ల పంపిణీని ఎప్పటికప్పుడూ మానిటర్ చేయా లన్నారు. పింఛన్ల పంపిణీ కోసం బ్యాంకుల నుంచి అవసరమైన నగదు పూర్తిగా విత్ డ్రా చేసుకుని పాయింట్ పర్సన్‌లకు అప్పగించాలన్నారు. పెన్షన్ల పంపిణీపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ఇందులో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా పంపిణీ కార్యక్రమాన్ని సజావుగా, విజయవంతం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

లోక్ అదాలత్‌లో 2,190 కేసులు పరిష్కారం

- రూ.7.51 కోట్లు కక్షిదారులకు చెల్లింపు
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీదేవి

మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీదేవి

ప్రజాశక్తి - కడప

జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 2190 కేసులు పరిష్కరించి రూ.7.51 కోట్లను కక్షిదారులకు చెల్లించినట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఛైర్మన్ జి. శ్రీదేవి, సీనియర్ సివిల్ జడ్జి, డిఎల్ఎస్ఎ సెక్రటరీ ఎస్. బాబా ఫక్రుద్దీన్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 22 బెంచీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కడపలో 6, ప్రొద్దుటూరులో 4, రాజంపేటలో1, రాయచోటిలో 4, బద్వేల్‌లో 2, పులివెందుల, కమలాపురం, జమ్మలమడుగు, లక్కిరెడ్డిపల్లె, మైదుకూరులలో ఒక్కొక్క బెంచిని ఏర్పాటు చేశామన్నారు. రాజంపేట మూడవ అదనపు జిల్లా కోర్టుకు సంబంధించిన కేసులు కడప ఆరవ అదనపు జిల్లా కోర్టు (ఫ్యామిలీ కోర్టు) బెంచ్‌లో పరిష్కరించినట్లు తెలిపారు. రైల్వే కోడూరు కోర్టుకు సంబంధించిన కేసులు ఎక్సైజ్ కోర్టు బెంచ్‌లో పరిష్కరించామని చెప్పారు. రాజంపేట మెజిస్ట్రేట్ కోర్టుకు సంబంధించిన, నందలూరు కోర్టుకు సంబంధించిన కేసులు కడప ఫస్ట్ అడిషనల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టు బెంచ్ లో పరిష్కరించినట్లు చెప్పారు. సిద్ధవటం కోర్టుకు సంబంధించిన కేసులు బద్వేలు జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ కోర్టు బెంచ్‌లో పరిష్కరించినట్లు తెలిపారు. జాతీయ లోక్ అదాలత్ లో ఎక్కువ కేసులు రాజీ అయ్యే విధంగా కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ఎల్. వెంకటేశ్వరరావు, నాల్గవ అదనపు జిల్లా న్యాయమూర్తి జి.దీనబాబు, ఆరవ అదనపు జిల్లా న్యాయమూర్తి షేక్ ఇంతియాజ్ అహ్మద్, సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ సెక్రటరీ ఎస్.బాబా ఫక్రుద్దీన్, సీనియర్ సివిల్ జడ్జ్ ఎస్.ప్రవీణ్ కుమార్, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జ్ కే.ప్రత్యూష కుమారి, ఎక్సైజ్ కోర్టు జడ్జి జె.హేమ ప్రసంతి, ఒకటవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె.నందిని, రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.భార్గవి, కడప బార్ అసోసియేషన్ అధ్యక్షులు బొగ్గుల గుర్రప్ప నాయుడు, న్యాయవాదులు, ప్రజలు, కక్షిదారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రాథమిక విద్యా రంగాన్ని కాపాడండి : యుటిఎఫ్

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రభుత్వ ప్రాథమిక విద్యారంగానికి గొడ్డలిపెట్టుగా మారిన జీవో నంబర్ 117ను రద్దు చేసే విధంగా ప్రభుత్వంపై తగిన ఒత్తిడి తీసుకురావాలని యుటిఎఫ్ నాయకులు కోరారు. శనివారం జిల్లా తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు ఆర్. శ్రీనివాసరెడ్డిని యుటిఎఫ్ కడప జిల్లా శాఖ పక్షాన కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే జీవో నంబర్ 117 ను రద్దుచేసి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను యధావిధిగా కొనసాగిస్తామని ప్రస్తుత విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీకి అనుగుణంగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల విలీనాన్ని రద్దుచేసి ఒకటో తరగతి నుంచి 5వ తరగతి వరకు ప్రాథమిక పాఠశాలలను పాత పద్ధతి లో కొనసాగించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఉన్నత పాఠశాలలు ఆరో తరగతి నుంచి పదవ తరగతి వరకు, ప్లస్ టు వరకు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రాథమిక విద్య మాతృభాషలోను, ఉన్నత విద్య తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో కొనసాగించాలని తెలిపారు.ఆదర్శ ప్రాథమిక పాఠశాలలను గుర్తించి తరగతికి ఒక ఉపాధ్యాయుని నియమించాలని, విద్యార్థుల సంఖ్యతో నిమిత్తం లేకుండా ప్రతి పాఠశాలలో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు కొనసాగేటట్లు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జీవో నంబర్ 117ను వెంటనే రద్దు చేసి వీలైనంత త్వరగా డిఎస్‌సి నియామకాలు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గత ప్రభుత్వం తీసుకువచ్చిన అప్రెంటిస్ విధానాన్ని రద్దుచేసి కొత్తగా నియామకం అయ్యే ఉపాధ్యాయులకు పూర్తి వేతనం చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. మోడల్ స్కూల్, ఎయిడెడ్, గురుకుల పాఠశాలల్లోని ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. కెజిబివి పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు రెగ్యులర్ వేతనాలు చెల్లించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఉపాధ్యాయులను బోధనేతర పనులకు దూరం చేసి బోధనకు మాత్రమే పరిమితం చేయాలని, అనవసర యాప్ లన్నింటినీ రద్దు చేయాలని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఆర్థిక బకాయిలన్ని చెల్లించి కొత్త పిఆర్‌సిని ప్రకటించే విధంగా కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సి.వి.రమణ, చింతకొమ్మదిన్నె మండల అధ్యక్షులు కేదార్నాథ్ పాల్గొన్నారు.

ఆర్‌జెడి అవినీతిపై విచారణకు ఆదేశం

ప్రజాశక్తి - కడప అర్బన్ : కడప విద్యా శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ రాఘవరెడ్డి అవినీతి అక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఆర్‌జెడి అక్రమాలపై చర్యలు తీసుకోవాలని మంత్రి నారా లోకేష్‌కు శాసనమండలి సభ్యుడు భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. అడిషనల్ డైరెక్టర్ ప్రసన్నను విచారణాధికారిగా ప్రభుత్వం నియమించింది.

వైద్యులు సమాజ సేవకులు

ప్రజాశక్తి - కడప అర్బన్ : వైద్యులు సమాజసేవకులని టిడిపి నగర ఉపాధ్యక్షులు కొండా సుబ్బయ్య అన్నారు. జులై 1న ప్రపంచ డాక్టర్ డే సందర్భంగా శనివారం ఎంఎం హాస్పిటల్ ప్రముఖ కీళ్ల వైద్యులు డాక్టర్ అబిద్‌ని శాలువాతో సత్కరించి మెమొంటో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ ఆబిద్ తల్లిదండ్రులు డాక్టర్ మహబూబ్ పీర్, డాక్టర్ ముంతాజ్ బేగం ప్రజలకు ఎన్నో సంవత్సరాలుగా సేవలు అందించారని తెలిపారు. వారి కుటుంబమంతా డాక్టర్ల కుటుంబంగా గుర్తింపు పొందాలని చెప్పారు. కార్యక్రమంలో ఆర్కే సేవా సమితి అధినేత అబ్దుల్ రాయల్ కరిముల్లా, ఏవో ఫరీద్ పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే ఎమ్మెల్యే 'పుత్తా' ధ్యేయం

ప్రజాశక్తి - కడప అర్బన్ : కమలాపురం నియోజకవర్గ అభివృద్ధే ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి ధ్యేయమని టిడిపి కడప జిల్లా అధికార ప్రతినిధి మన్నూర్ అక్బర్ పేర్కొన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అధికారులు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని కమలాపురం శాసనసభ్యులు ఇటీవల అధికారుల సమీక్ష సమావేశంలో ఆదేశించారని పేర్కొన్నారు. అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే కమలాపురం ప్రజలకోసం నియోజకవర్గంలోని వివిధ మండల శాఖల అధికారులతో సమావేశమయ్యారని చెప్పారు. ప్రజలకు అవసరమై సౌకర్యాల పై చర్చించి అందరం కలిసి అభివృద్ధి, సంక్షేమం కోసం పాటుపడాలని కోరారని తెలిపారు. అధికారులకు ఏమైనా సమస్యలుంటే తన వద్దకు రావాలని ఎమ్మెల్మే సూచించారని చెప్పారు. ప్రజల ఎంత పెద్ద సమస్యలతో వచ్చినప్పటి ఎప్పటికప్పుడూ పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారని పేర్కొ న్నారు. కమలాపురం నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే ఎల్లప్పుడూ పాటు పడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ముందుంటారని తెలిపారు.

రేపటి నుంచి యోగా బ్యాచ్ ప్రారంభం

ప్రజాశక్తి - కడప అర్బన్ : నగరంలోని పటేల్‌రోడ్డులో ఉన్న మిత్ర యోగా సెంటర్‌లో 30 రోజుల పాటు నిర్వహించే యోగా శిక్షణ కొత్త బ్యాచ్‌ను జులై 1 నుంచి ప్రారంభిస్తున్నట్లు యోగా నిపుణులు డాక్టర్ కె.కల్పన, డాక్టర్ ఆర్ రంగనాథ్ రెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. శిక్షణలో రోగ నిరోధక శక్తిని పెంచుకోవడానికి, మానసిక ఒత్తిడిని తగ్గించుకోవడానికి, అధిక బిపి, డయాబెటిస్, ఒబేసిటీ వంటి దీర్ఘకాలిక సమస్యల నివారణకు, ఊపిరితిత్తుల సామర్థ్యాన్ని పెంచుకోవడానికి అవసరమైన యోగాసనాలు, ప్రాణాయామం, సూర్యనమస్కారాలు, షట్ క్రియలు, ధ్యానం వంటి యోగ ప్రక్రియలను శాస్త్రీయంగా సాధన చేయిస్తామని తెలిపారు. శిక్షణ ఉదయం 5.45 గంటల నుంచి 7.00 గంటల వరకు మొదటి బ్యాచ్, 8.30 గంటల నుంచి 10 గంటల వరకు మహిళలకు రెండో బ్యాచ్ ఉంటుందని పేర్కొన్నారు. సాయంత్రం 5.30 గంటల నుంచి 6.30 గంటల వరకు మూడవ బ్యాచ్ ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాలుకు 9848861206, 7013238986లలో సంప్రదించాలన్నారు.

ఉత్తమ విద్యార్థులకు నగదు బహుమతి

ప్రజాశక్తి-కాశినాయన



విద్యార్థికి చెక్కును అందజేస్తున్న దాత

మండల కేంద్రమైన నరసాపురం హైస్కూల్‌లో చదివి పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు శనివారం ఎంఇఒ నిర్మల చేతుల మీదుగా నగదు బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాల పూర్వ విద్యార్థి చెన్నారెడ్డి పేద విద్యార్థులను విద్యా పరంగా ప్రోత్సహించి ఆర్థికంగా ఆదుకోవడం అభినందనీయమన్నారు. ప్రస్తుతం చెన్నారెడ్డి పాఠశాలలో బాగా చదవి పెద్ద కాంట్రాక్టర్ అయ్యాయరని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు వెళ్లాలన్ని సూచిం చారు. మొదటి నగదు బహుమతిగా రూ. 35000, ద్వితీయ బహు మతిగా రూ. 25000, తృతీయ బహుమతిగా రూ. 20000, నాలుగో బహుమతిగా రూ.10000 చొప్పున పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కొండి శెట్టి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో దాత అంబవరం చెన్నారెడ్డి, మురళి, పాఠశాల ప్రిన్సిపల్ సౌజన్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు అనుబంధం) నాయకుల కోరారు. శనివారం కడప ఎమ్మెల్యే మాధవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మాసాపేట రోడ్డు వైండింగ్‌లో ఇల్లు కోల్పోయిన వారికి, చనిపోయిన కార్మికుల కుటుంబాల్లో కారుణ్య నియామకాలు చేపట్టాలని కోరారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న మున్సిపల్ క్వార్టర్స్ పట్టా ఇప్పించే కార్యక్రమం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే వీలైనంత త్వరగా సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మన కార్మికుల పట్ల మన వృత్తి పట్ల ఎంతో అనుకూలంగా స్పందించిన వారికి మరోసారి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సుంకర రవి, తిరుపాల్, శ్రీధర్ బాబు, ప్రకాష్, సుంకర కిరణ్, నాగరాజు, రమేష్, నాయక్,ఎన్. వెంకటేష్, అజ్మొద్దీన్, సుబ్బారెడ్డి, లక్ష్మారెడ్డి, శివ, పెంచలయ్య, రాజు, హరి, రవి, మహదేవ్, సుధాకర్, ఓబులేష్, నరసింహారావు, మహేష్, సల్మాన్,పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొన్నారు.

నగరంలో కార్పొరేట్ వైద్య సౌకర్యాలు

ప్రజాశక్తి- కడప అర్బన్

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవి

నగరంలో కార్పొరేట్ వైద్య సౌకర్యాలు ప్రజలకు అందుబాటులోకి రావడం సంతోషకరమని కడప ఎమ్మెల్యే మాధవి, టిడిపి జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం నగరంలోని శ్రీ శ్రీ హోలిస్టిక్ హాస్పిటల్ లో ఆక్సిజన్ ప్లాంట్, క్యాథ ల్యాబ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. కార్పొరేట్ వైద్యం అందుబాటులోకి రావడం వల్ల జిల్లా వాసులు ఇతర ప్రాంతాలకు వైద్యం కోసం వెళ్లాల్సిన అవసరం ఉండదని చెప్పారు. ఆరోగ్యశ్రీలో ఉన్న సమస్యలను టిడిపి ప్రభుత్వం పరిష్కరిస్తుందని తెలిపారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఇట్లా ఎంటర్‌ప్రైజస్ ప్రొప్రైటర్ రామాంజనేయమ్మ మాట్లాడుతూ పిఎస్‌ఎ సిస్టం గాలి తీసుకుంటుందని చెప్పారు. కంప్రెసర్, డయర్‌ను ఉపయోగించి గాలిలో తేమను తీసివేస్తుందని పేర్కొన్నారు. రకరకాల ఫిల్టర్స్ ఉపయోగించి దుమ్ము, ధూళి ఆయిల్ తీసివేసి స్వచ్ఛమైన గాలిని తీసుకుంటుందని తెలిపారు. దీనిని ఒక సిలిండర్లోకి పంపిస్తుందని తెలిపారు. ఈ గాలిలో ఆక్సిజన్, నైట్రోజన్, కార్బన్డయాక్సైడ్ వాయువులు ఉంటాయని చెప్పారు. జుమో లైట్స్ అనే రసాయనాన్ని ఉపయోగించి నైట్రోజన్ మిగతా వాయువులను పీల్చివేసి ఆక్సిజన్ ను మరో సిలిండర్లోకి పంపుతుందని పేర్కొన్నారు. అక్కడి నుంచి ఆక్సిజన్ ఆసుపత్రి బెడ్సుకు సరఫరా అవుతుందని తెలిపారు. ఈ జియో లైట్స్ పీల్చుకున్న ఇతర వాయువులను వెంటనే కిందికి వదిలేస్తుందని చెప్పారు. జిల్లాలో మొదటిసారి దీన్ని ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. సమావేశంలో ఆసుపత్రి సిఇఒ శరత్ బాబు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయుల సమ్మేళనం

ప్రజాశక్తి - కడప అర్బన్

40 సంవత్సరాల కందుల విద్య సంస్థల సుదీర్ఘ ప్రయాణంలో వేల మంది విద్యార్థిని, విద్యార్థులు ఉన్నతమైన స్థితిలో స్థిరపడ్డారు. వారిలో 1995 - 1999 బ్యాచ్ వారి సిల్వర్ జూబ్లీ సందర్భంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిలుగా ఒకప్పటి కెఎస్‌ఆర్ఎం కళాశాల లో పనిచేసిన వైవీయూ ప్రిన్సిపల్ డాక్టర్ జయచంద్రరెడ్డి, ఐఐఐటి నూజివీడు డైరెక్టర్ డాక్టర్ జయరమి రెడ్డి, ఎస్.కె. యూనివర్సిటీ మాజీ విసి డాక్టర్ ఎం. రామకృష్ణారెడ్డి, మరి కొంతమంది హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కెఎస్‌ఆర్ఎం ఒక గొప్ప చరిత్ర కలిగిన విద్య సంస్థ అన్నారు. ఇక్కడ చదివిన వారు దేశ, విదేశాల్లో అతున్నత సంస్థలలో సేవలు అందిస్తు కళాశాలకు గర్వకార్ణంగా నిలిచారన్నారు. ఇక్కడ చదవడం ఎపుడూ ఒక అదృష్టంగా భావిస్తామన్నారు. తమకు చదువు చెప్పిన గురువులను, యాజమాన్యన్ని ఘనంగా సత్కరించారు. కళాశాల ఎండీ డాక్టర్ చంద్ర ఓబుల్ రెడ్డి మాట్లాడుతూ తమ సంస్థలో చదివిన విద్యార్థులు ఉన్నతమైన స్థాయిలో ఉండటం చాలా సంతోషం అన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్, సెక్రటరీ, ట్రేజరర్ కందుల రాజేశ్వరమ్మ, ప్రిన్సిపల్ వి.ఎస్. ఎస్.మూర్తి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ టి.ఎన్. ప్రసాద్, అడ్మనిస్ట్రేటివ్ మేనేజర్ పి. ప్రేమ్ కుమార్, వివిధ విభాగాధిపతులు, డీన్లు, కెఎస్‌ఆర్ఎం అల్లుమిని విభాగాధిపతి సిబ్బంది, కళాశాలలు బోధన, భదనేతర సిబ్బంది పాల్గొన్నారు.

'నీట్'లో అక్రమాలపై మౌనం వీడాలి : కాంగ్రెస్

ప్రజాశక్తి - కడప

మాట్లాడుతున్న మహమ్మద్అలీఖాన్

నేషనల్ ఎలిజిబిలిటీ కం ఎంట్రన్స్ టెస్ట్ (నీట్) 2024వ సంవత్సరానికి సంబంధించిన ఎంబిబిఎస్ సీట్ల అర్హత సాధించే పరీక్ష ప్రశ్న పత్రాల లీకేజీలు, అవినీతి, అక్రమాలకు పాల్పడిన కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్రంలో ఎన్‌డిఎ కూటమిలో ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ బయటి నుంచి మద్దతిస్తున్న వైసిపి అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి రాజకీయ మౌనం వీడాలని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మైనార్టీ ఉపాధ్యక్షులు పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్ పేర్కొన్నారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా 24 లక్షల మంది విద్యార్థులు నీట్ పరీక్ష రాయగా అందులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి 58 వేల మంది పరీక్షలు రాశారన్నారు. 39,039 మంది వివిధ ర్యాంకుల్లో ఎంబిబిఎస్ సీట్ల ప్రవేశానికి అర్హత సాధించారన్నారు. కానీ కేంద్రంలోని లీకులు, కుంభకోణాలతో విధ్వంస కర పాలన సాగిస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వంపై మన రాష్ట్రంలోని ప్రధాన పార్టీలు పల్లెత్తు మాట మాట్లాడకపోవడం సిగ్గుచేటన్నారు. వందల కోట్ల రూపాయలకు బిజెపి మంత్రులు, నాయకులు ప్రశ్న పత్రాలను అమ్ముకున్నట్లు బహిర్గతమవుతుందని ఆరోపించారు. నీట్ అభ్యర్థులపై పోలీసులు అమానుషంగా లాఠీచార్జి చేయడం దారుణ మన్నారు. లోక్‌సభలో శుక్రవారం నీట్ కుంభకోణంపై చర్చించడానికి పట్టుబట్టిన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని మాట్లాడనివ్వకుండా లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అడ్డుకొని, నియంతల వ్యవహరించారని వాపోయారు. పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిలారెడ్డి ఆధ్వర్య ంలో కాంగ్రెస్ పార్టీ మన రాష్ట్రం విద్యార్థులతో పాటుగా దేశంలోని విద్యార్థులు యువతకు అండగా నిలుస్తుందని తెలిపారు. సమావేశంలో ఒబిసి జిల్లా కాంగ్రెస్ పార్టీ చైర్మన్ చిన్న కుళ్లాయప్ప డిసిసి ఉపాధ్యక్షులు, మాజీ కార్పొ రేటర్ రహమతుల్లా ఖాన, కాంగ్రెస్ పార్టీ నేత రఫీ ఖాన్ పాల్గొన్నారు.

స్పీకర్ విషయంలో వైసిపి తీరు సరికాదు

ప్రజాశక్తి - బద్వేలు : లోక్‌సభ స్పీకర్ విషయంలో వైసిపి వ్యవహరించిన తీరు సరైందని కాదని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి. శివకుమార్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని సుందరయ్య భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో బద్వేల్ పట్టణ కార్యదర్శి కె.శీనుతో కలిసి ఆయన మాట్లాడారు. లౌకికవాదానికి తిలోదకాలు ఇచ్చిన మతతత్వ బిజెపి కూటమికి మద్దతు తెలపడం జగన్మోహన్ రెడ్డి దిగజారుడుతనానికి నిదర్శనమని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇండియా వేదికతో పోరాటం చేసి, ఓడిపోయి అదే కూటమి ప్రతిపాదించిన స్పీకర్‌కు మద్దతు తెలపటం దుర్మార్గమని పేర్కొన్నారు. ఇటువంటి నిర్ణయాలతో మత ఉన్మాద శక్తులు పెట్రేగి పోవటానికి దోహదం చేస్తాయన్నారు. వైసిపి అవలంభించిన తీరు వారి దివాలా కోరు రాజకీయంగా పరిగణిస్తున్నామని పేర్కొన్నారు. జులై 1,2 తేదీల్లో కడప యుటిఎఫ్ భవన్‌లో నిర్వహించే సిపిఎం నిర్వహించే రాజకీయ శిక్షణ తరగతలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఎం నాయకులు ముడియం చిన్ని, ఆంజనేయులు, మోక్షమ్మ ఖైరున్ బి, రామలక్ష్మమ్మ బాలమ్మ, బాబు, గంపా సుబ్బరాయుడు, అజయ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

ప్రజాశక్తి - కడప : విద్యుత్ వినియోగదారుల సౌకర్యార్థం ఆదివారం సెలవు దినం అయినప్పటికీ జిల్లా వ్యాప్తంగా విద్యుత్ బిల్లుల వస్తువులు కేంద్రాలు యధాతధంగా పనిచేస్తాయని, విద్యుత్ వినియోగదారులు తమ విద్యుత్ బిల్లులను చెల్లించవచ్చునని జిల్లా విద్యుత్ శాఖ అధికారులు ఎస్. రమణ తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించి సంస్థ అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

'ఉర్దూ' సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఉర్దూ పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు అందించాలని, ఉర్దూ ఉపాధ్యాయుల పోస్టులను డిఎస్‌సి ద్వారా భర్తీ చేయాలని, ఉర్దూ పాఠ్యపుస్తకాలను సిఎస్ఇ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ ఇర్షాద్ , ప్రధాన కార్యదర్శి జాకీర్ హుస్సేన్ కోరారు. శనివారం కడప ఎమ్మెల్యే మాధవి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాస రెడ్డికి వినతి పత్రం అందజేశారు. అందుకు వారు స్పందిస్తూ ఉర్దూ పాఠశాలల సమస్యలు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని వారు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రూట నాయకులు అబ్దుల్ హకీమ్, సిరాజుద్దీన్, అఫ్జల్ బాష, మహమ్మద్ అయుబ్, ఫక్రుద్దీన్, ఖాజా మైనుద్దీన్, షాబుద్దీన్, జుబేర్ అహ్మద్ పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రత పాటించాలి

ప్రజాశక్తి-కాశినాయన

పాఠశాలలోని పిల్లలందరూవ్యక్తిగత పరిశుభ్రత పాటించి వ్యాధుల బారిన పడకుండా చూసుకోవాలని హెల్త్ సూపర్‌వైజర్ బాలయ్య పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని ఎపి మోడల్ పాఠశాలలో విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతపై దృష్టి కేంద్రీకరించాలని, ఇంటిని కూడా పరిశుభ్రత ఉండేలా చూసుకోవాలన్నారు. అనంతరం పాఠశాలలో ఉన్న వంటగదిని, భోజన హాలును, వాటర్ ట్యాంకులను పరిశీలించి అక్కడ ఉన్న సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. హాస్టల్ పరిసరాలు శుభ్రంగా ఉంచే బాధ్యత సిబ్బందిదే అని ఆయన తెలిపారు. ప్రస్తుతం సీజన్ వ్యాధులు అధికంగా వస్తుంటాయని, ఏమాత్రం భయపడకుండా వెంటనే మాకు సమాచారం ఇవ్వాలన్నారు కార్యక్రమంలో పిహెచ్ఎన్ శారద, హుస్సేనమ్మ, వార్డన్ వెంకటేశ్వరమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి, ఇసుక తరలిస్తే చర్యలు

ప్రజాశక్తి - వల్లూరు

మండల పరిధిలోని చెరువు కిందపల్లి, పుత్తచిన్నయ్యపల్లి, కొప్పోలి గ్రామాల్లో అక్రమంగా మట్టి , ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ కత్తి వెంకటరమణ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని చెరువు కింద పల్లి వద్ద అక్రమంగా ఇసుక తరలించకుండా, దారిలో వాహనాలు తిరగకుండా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా చట్ట విరుద్ధంగా ప్రవర్తించి ఇసుక, మట్టిని అక్రమంగా తరలిస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు.

ప్రశ్నార్థకం!

ప్రజాదృష్టి

జిల్లా జ్వరాల బారిన పడింది. జిల్లాలో మారుతున్న వాతావరణ పరిస్థితుల కారణంగా రోజురోజుకూ జ్వరతీవ్రత పెచ్చరిల్లుతోంది. పిల్లలు, పెద్దలు, వృద్ధులనే తేడా లేకుండా శారీరక, మానసిక, ఆర్థిక అనారోగ్యం బారినపడి విలవిల్లాడుతున్నారు. ఫలితంగా సమాజ ఆర్థిక జీవనాడులు స్తంభించిపోవడం ఆందోళన కలిగిస్తోంది. జిల్లాలోని జమ్మలమడుగు నియోజకవర్గం ఎర్రగుంట్ల మండలానికి చెందిన ఓ మెడికో విద్యార్థిని డెంగీ జ్వరం బారిన పడి మృతి చెందడం చర్చనీయాంశంగా మారింది. వాస్తవానికి ఆమె బెంగళూరులో డెంగీ బారిన పడినప్పటికీ, బెంగళూరు, కడప జిల్లాలో జ్వరాల విజృంభణకు తేడా లేదనే సంగతిని గ్రహించాలి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జ్వరాల తీవ్రతను పరిశీలిస్తే 100 డెంగీ, 24 మలేరియా కేసులు నమోదు కావడం జ్వరాల తీవ్రతకు అద్దం పడుతోంది. రాబోయే రోజుల్లో వర్షాల తీవ్రత పెరగడం, తాగునీరు కలుషితం కావడానికి అవకాశం ఉంది. జ్వరాల తీవ్రత మరింత పెచ్చరిల్లే ప్రమాదం పొంచి ఉందని చెప్ప వచ్చు వేసవి సీజన్ నుంచి వర్షపు సీజన్‌లోకి మారడంతో వాతావరణంలో బ్యాక్టీరియా, వైరస్, ఫంగస్‌లు జీవం సంతరించుకుని జ్వరాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. డిఎంహెచ్‌ఒ, సిహెచ్‌సి వైద్య కేంద్రాలు, పారిశుధ్యం, తాగునీటి కలుషితం నివారణకు దృష్టి సారించాల్సి ఉంది. సదరు వైద్య ఆరోగ్య, పారిశుధ్య, తాగునీటి సరఫరా విభాగాలు జ్వరాలకు సున్నిత కేంద్రాలు, అతిసున్నిత కేంద్రాలను గుర్తించి, జ్వరాల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి. దోమల గుడ్లు, లార్వాల వృద్ధి నిరోధక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇటువంటి కట్టుదిట్టమైన చర్యల స్థానంలో మొక్కుబడి తనానికి అలవాటు పడితే దారినపోయే పెను ప్రమాదాన్ని ఇంట్లోకి ఆహ్వానించి నట్లు అవుతుందని గ్రహించాలి. ప్రజారోగ్య పరిరక్షణ పట్ల నెలకొన్న నిర్లక్ష్యాన్ని జిల్లా ఉన్నతాధికార యంత్రాంగం సీరియస్‌గా దృష్టి సారించాలి. పదేళ్ల కిందట ఉమ్మడి జిల్లా డెంగ్యూ బారిన పడిన సమయంలో పలువురు రోగులు తిరుపతి, కర్నూలు, చెన్నయ్, బెంగళూరు, హైదరాబాద్ వంటి మహానగరాలకు పరుగులు తీసిన సంగతి గుర్తుకువస్తోంది. ఫలితంగా లక్షలాది రూపాయలు కోల్పోవడం తెలిసిందే. అప్పట్లో ఉమ్మడి జిల్లాలో 72 పిహెచ్‌సి, 16 సిహెచ్‌సి, ఏరియా ఆస్పత్రి, జిల్లా ప్రభుత్వ సర్వజన ఆస్పత్రుల్లో డెంగ్యూ ప్లేట్‌లెట్స్ ఎక్కించే సదుపాయ లేమి కారణంగా నగరాలకు పరుగులు తీయాల్సి వచ్చింది. ప్రస్తుతం జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్లేట్‌లెట్స్ ఎక్కించే సదుపాయం ఉన్నప్పటికీ వైద్యుల్లో చిత్తశుద్ధి ప్రశ్నార్థకంగా మారింది. వీరికితోడు నర్సుల నిర్లక్ష్య వైఖరి కారణంగా ప్రయివేటు ఆస్పత్రులను ఆశ్రయించాల్సిన దుస్థితి దాపురించింది. కుటుంబ ఆర్థిక పరిస్థితులు సహకరించని రోగులు సైతం ప్రయివేటు ఆస్పత్రులకు వేలాది రూపాయలు కొల్లబెడుతున్న దృశ్యం కనిపిస్తోంది. రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖా మంత్రి సత్యకుమార్ జిల్లా వాసి కావడంతో జ్వరాల తీవ్రతపై సీరియస్‌గా దృష్టి సారించాల్సిన అవసరం ఉరుముతోంది.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి

గుక్కెడు తాగునీరివ్వండి మహాప్రభో..

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక పంచాయతీ పరిధిలోని 3వ వార్డులో తాగునీటిని సరఫరా చేసి అధికారులు పుణ్యం కట్టుకోవాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. వేంపల్లె పంచాయతీ పరిధిలోని 3వ వార్డులో ఉన్న ప్రజలు శనివారం వార్డు మెంబరు ముత్యాల ఆంజనేయులు దృష్టికి తాగునీటి సమస్యను తెచ్చారు. నాలుగు రోజులు నుంచి తాగునీరు రావడం లేదని ఇబ్బందులకు గురవు తున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పాపాఘ్ని నదిలో పుష్కలంగా నీరు ఉన్నప్పటికీ నీరు సక్రమంగా సరఫరా చేయకపోవడం చాలా బాధకరమని వార్డు మెంబరు ముత్యాల ఆంజనేయులు పేర్కొన్నారు. తాగునీటిని సరఫరా చేసేందుకు సిబ్బంది ఎక్కువ మంది ఉన్నప్పటికీ నీరు సకాలంలో పంపిణీ చేయకపోవడం ఏంటని ఆయన ప్రశ్నించారు. పంచాయతీ అధికారులు, సర్పంచ్ తాగునీటి సరఫరాపై ప్రత్యేకదృష్టి పెట్టాలని ప్రజలు కోరారు. తాగునీటి సరఫరాకు అంతరాయం లేకుండా చూసే బాధ్యత అధికారులు తీసుకోవాలని కోరారు.

నేడు సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

వారాంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా ఆదివారం సాయంత్రం 5.40 గంటల నుంచి రాత్రి 8.00 గంటల వరకు డాక్టర్ వైఎస్ఆర్ ఉలిమెల్ల లేక్ ఫ్రంట్‌లో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు శిల్పారామం పరిపాలన అధికారి సుధాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నాట్యాచార్యులు మానస, మానస నృత్య కళా కేంద్రం, ధర్మవరం వారిచే ప్రత్యేక నృత్య ప్రదర్శనలు ఉంటాయన్నారు. చిన్నారులచే కోలాటం, జానపద, వెస్ట్రర్న్ మొదలగు ప్రదర్శనలు ఉంటాయన్నారు. పులివెందుల పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని సదరు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని శిల్పారామం పరిపాలన అధికారి కోరారు.

'పాడా' ప్రత్యేకాధికారి అనిల్‌కుమార్‌రెడ్డి బదిలీ

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పులివెందుల డెవలప్‌మెంట్ ఏజెన్సీ అథారిటీ (పాడా) ప్రత్యేక అధికారి బి.అనిల్‌కుమార్‌రెడ్డిని బదిలీ చేస్తున్నట్లు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. వైసిపి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి పులివెందుల పాడా ప్రత్యేకాధికారిగా ఆయన విధులు నిర్వహిస్తూ వచ్చారు. ఆయనకు గత ప్రభుత్వం ఐఎస్ హోదా కల్పించింది. ప్రస్తుతం ఆయనకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. నేరుగా సాధారణ పరిపాలనా విభాగం (జిఎడి)లో రిపోర్టు చేయాలని ఇచ్చిన ఉత్తర్వులో ప్రభుత్వం పేర్కొంది.

పింఛన్ల పంపిణీలో నాయకులు పాల్గొనాలి

- టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బిటెక్ రవి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

సోమవారం జరిగే ఎన్టీఆర్ పెన్షన్ల భరోసా పంపిణీ కార్యక్రమంలో ప్రతి నాయకుడు సచివాలయ సిబ్బందితో కలిసి పాల్గొనాలని శనివారం టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మారెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి(బిటెక్ రవి) ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన విధంగా అవ్వతాతలకు పెన్షన్, ఇతరుల పెన్షన్ పెంచి ఇవ్వనున్నట్లు తెలిపారు. పెన్షన్ డబ్బులు సైతం సచివాలయ సిబ్బంది వారి ఇంటి వద్దనే ఇచ్చేలా రూపకల్పన చేశారన్నారు. మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు, డివిజన్, వార్డు అధ్యక్షులు, క్లస్టర్, యూనిట్, బూత్, సెక్షన్ ఇన్‌ఛార్జిలు ఇతర పదవుల్లో ఉన్న నాయకులు ఆయా సచివాలయ పరిధిలో ఇంటింటికీ వెళ్లి పెన్షన్లు పంపిణీ చేయాలని ఆయన సూచించారు.

సుందరయ్య నగర్ సమస్యలపై వినతి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

స్థానిక నగర పంచాయతీ పరిధిలోని సుందరయ్య నగర్‌లో నెలకొన్న సమస్యలపై మండల ఇన్‌ఛార్జి మధుసూదన్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. సుందరయ్య నగర్‌లో రోడ్డుకు అడ్డంగా విద్యుత్ స్తంభాలు ఉన్నాయని, కాలువలు పూర్తిగా నాపరాయి వేస్ట్‌తో పూడిపోయాయని, కాలనీకి ప్రత్యేకంగా రేషన్ షాప్ ఏర్పాటు చేయాలని జాకట విజయ్ శేఖర్ కోరారు. సమస్యలు పరిశీలించి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని మధుసూదన్‌రెడ్డి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో దీపక్, దినేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే 'ఆది'ని కలిసిన జిల్లా ఎన్‌జిఒ నాయకులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జమ్మలమడుగు శాసనసభ్యులు చదిపిరాళ్ళ ఆదినారాయణరెడ్డిని, టిడిపి కడప పార్లమెంట్ ఇన్‌ఛార్జి చదిపిరాళ్ళ భూపేష్ సుబ్బరామిరెడ్డిని శనివారం ఎపి ఎన్‌జిఒ జిల్లా జిల్లా అధ్యక్షులు బి. శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.ప్రసాద్ యాదవ్, జిల్లా కార్యదర్శి డి.రవికుమార్, కోశాధికారి పి.నిత్య పూజయ్య, జమ్మలమడుగు తాలూకా అధ్యక్షులు పి.నారాయణరెడ్డి, కార్యదర్శి వై.రఘునాథ్‌రెడ్డి సిటీ ఉపాధ్యక్షులు డి.పద్మనాభం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో కూటమి విజయానికి ఎపి ఎన్‌జిఒలు మద్దతు తెలియజేసి అందరి విజయానికి దోహద పడినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఉద్యోగుల సమస్యలు, డిమాండ్స్ ముఖ్యమంత్రి త్వరలో పరిష్కరిస్తారి పేర్కొన్నారు.

కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సుల సమస్యలు పరిష్కరించాలని వినతి

నియోజకవర్గంలోని ఆయా ఆసుపత్రుల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు తమ సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే సి.ఆదినారాయణరెడ్డిని శనివారం దేవగుడిలో కలిసి వినతిపత్రం అందజేశారు. ముందుగా ఆంధ్రప్రదేశ్ స్టాఫ్ నర్సెస్ స్ట్రగుల్ కమిటీ ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి మాట్లాడుతూ ప్రత్యేకంగా ముఖ్యమంత్రి, ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్‌కు సమస్యలను వివరించి పరిష్కారం చేసేలా చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్టాఫ్ నర్సులు రాణిలక్ష్మి, స్వర్ణ, సుబ్బమ్మ, జ్యోతి, సుధ, ఓబులమ్మ పాల్గొన్నారు.

ఏరువాకమ్మ వార్షికోత్సవంలో భూపేష్‌రెడ్డి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

పట్టణంలో వెలసిన శ్రీ ఏరువాకమ్మ ఆలయ 27వ వార్షికోత్సవంలో జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డి పాల్గొన్నారు. భూపేష్ రెడ్డి అమ్మవారిని దర్శించుకొని ప్రతేక పూజలు నిర్వహించారు. వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు ఆలయాన్ని విద్యుద్దీపాలు, పూల మాలలతో అలంకరణ చేశారు. అమ్మవారి దర్శనానికి పట్టణ ప్రజలేకాక పరిసర ప్రాంతాల నుండి భక్తులు పోటెత్తారు. నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేశారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు ఎంఇఒ శివప్రసాద్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న పుస్తకాలు, బ్యాగు, యూనిఫామ్‌ను వినియోగించుకోవాలని తెలిపారు. ప్రతి ఒక్క విద్యార్థి మంచి మార్కులు సాధించేలా శ్రమించాలని, పాఠశాలకు, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామాంజనేయులురెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రతపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

విద్యార్థులు శుభ్రతపై ప్రత్యేకదృష్టి పెట్టాలని జిల్లా ఉప వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఖాజా మొహిద్దీన్ సూచించారు. సార్డ్స్, సోషల్ యాక్టివిటీస్ ఫర్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ గ్రామాల సంయుక్త ఆధ్వర్యంలో డెటాల్ బనేగా స్వస్థ్ ఇండియా ప్రాజెక్ట్‌లో భాగంగా మండలానికి చెందిన 27 పాఠశాలల ఉపాధ్యాయులకు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల అహోబిలపురం మెయిన్‌లో ఎంఇఒ చంద్రశేఖర్ అధ్యక్షతన చేతుల పరిశుభ్రతపై శనివారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఎంఇఒ చంద్రశేఖర్ డిబిఎస్ఐ జిల్లా సమన్వ యకర్త విష్ణువర్ధన్ మాట్లాడారు. రిసోర్స్ పర్సన్‌గా దేవరాజు వ్యవహరించారు. డిబిఎస్ఐ ఒంగోలు జిల్లా డిపిఎం లక్ష్మి, స్నేహిత అమృత హస్తం సేవా సమితి అధ్యక్షులు మొమ్మెల రాజు, వాలంటీర్లు కానాల ఈశ్వరయ్య, ఆశా పాల్గొన్నారు.

ఏదీ.. మొక్కల పెంపకం, పార్క్‌ల ఏర్పాటు

ప్రజాశక్తి - చాపాడు

ఉపాధి హామీ చట్టం ద్వారా గ్రామాల్లో పార్క్‌ల ఏర్పాటు, మొక్కల పెంపకం కోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు అధికారులు ప్రచారానికి మాత్రమే పరిమితమయ్యారు. ఆచరణలో ఏమాత్రం కనిపించడం లేదనే విమర్శలు వినివి స్తున్నాయి. పల్లవోలు, బద్రిపల్లి గ్రామాల్లో ఉపాధి పనుల గుర్తింపు కార్యక్రమాన్ని పరిశీలించారు. గత ప్రభుత్వ హయాంలో ఉపాధి హామీ ద్వారా గ్రామాల్లో పార్క్‌లను అభివృద్ధి చేసేందుకు అనుమతులు ఉన్నాయని ప్రచారం నిర్వహించారు. రైతులకు కూడా వివిధ రకాల పండ్లతోటల పెంపకానికి అవకాశం ఉందని తెలిపారు. రైతులకు అవగాహన కల్పించి పండ్ల తోటల పెంపకాన్ని అభివృద్ధి చేయడంలో అధికారులు పూర్తిగా విఫల మయ్యారనే విమర్శలున్నాయి. పండ్ల తోటల పెంపకం చేపట్టడం వల్ల వ్యవసాయ పనులు తగ్గిన సందర్భంలో కూలీలకు పనులు కల్పించే అవకాశం ఉంటుంది. చాపాడు మండల పరిధిలో కెసి, కూందూ పరిధిలో నీరు అందుబాటులో ఉన్న సందర్భంలో ఉపాధి కూలీలకు పనులు చేసే అవకాశం లేదు. పండ్ల తోటల పెంపకం అభివృద్ధి చేస్తే అన్ని కాలాల్లో పనులు చూపే అవకాశం ఉంటుంది. గ్రామాల్లో పార్కులను ఏర్పాటు చేస్తే విద్యార్థుల మానసిక ఉత్తేజానికి అవకాశం ఉం టుంది. ఇప్పటికైనా అధికారులు గ్రామాల్లో పార్కుల అభివృద్ధికి, పండ్లతోట పెంపకానికి అధిక ప్రాధాన్యతనివ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పని చేస్తున్న 'ఉపాధి' కూలీలు

పోలవరం ప్రశ్నార్థకానికి ఆ ముగ్గురే కారకులు

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్రానికి వరప్రసాదిని కావాల్సిన పోలవరం సాగునీటి ప్రాజెక్టు ప్రశ్నార్థకంగా మారడానికి మోడీ, చంద్రబాబు, జగన్ అనే ముగ్గురే కారణమని పిసిసి మీడియా చైర్మన్ ఎన్. తులసిరెడ్డి తెలిపారు. శనివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పోలవరం బహుళార్థ సాధక ప్రాజెక్టు అన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే 7.20 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు సాగునీరు లభిస్తుందని తెలిపారు. 23.50 లక్షల ఎకరాల పాత ఆయకట్టు స్థిరీకరణ అవుతుందని తెలిపారు. 450 గ్రామాల్లో 28.50 లక్షల మందికి తాగునీరు, విశాఖ నగర వాసులకు తాగునీరు, విశాఖ ఉక్కు కర్మాగారానికి నీరు అందుతుందని వివరించారు. 960 మెగా వాట్ల జల విద్యుత్ ఉత్పత్తి అవుతుందని చెప్పారు. గోదావరి–కృష్ణా నదుల అనుసంధానం అవుతుందని పేర్కొన్నారు. 80 టిఎంసిల గోదావరి జలాలు కృష్ణ డెల్టాకు మళ్లించి ఆ మేరకు పొదుపు చేసిన కృష్ణ నికర జలాలు రాయలసీమ ప్రాజెక్టులకు కేటాయించవచ్చు అన్నారు. పోలవరం ప్రాజెక్టు కాంగ్రెస్ మానస పుత్రిక అన్నారు. నాటి కాంగ్రెస్ సిఎం అంజయ్య ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. 2004 జూలైలో కాంగ్రెస్ సిఎం వైఎస్. రాజ శేఖర్‌రెడ్డి పరిపాలన మంజూరు చేశారని చెప్పారు. 2004–2014లో కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 5,136 కోట్లు రాష్ట్ర ఖజానా నుండి ఖర్చు చేసి 32 శాతం పనులు పూర్తి చేసి నట్లు చెప్పారు. జాతీయ ప్రాజెక్టుగా చట్టబద్ధత కల్పించారన్నారు. ప్రాజెక్టును పూర్తిచేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. మోడీ ప్రభుత్వం బాధ్యతారాహిత్యంతో రాష్ట్రప్రభుత్వానికి అప్పగించినట్లు తెలిపారు. సకాలంలో సరిపడ నిధులు విడుదల చేయలేదన్నారు. కేంద్రం నిర్మాణం చేయాల్సిన బాధ్యతను చంద్రబాబు ప్రభుత్వం తన మీద వేసుకోవడం తప్పుఅన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రాజెక్టును తన స్వాధీనంలోకి తీసుకోవాలని కోరారు. నిర్ణీత కాలవ్యవధిలో కేంద్ర ప్రభుత్వమే నిర్మించాలని తులసిరెడ్డి కోరారు.

పోలవరం ప్రాజెక్టు గురించి వివరిస్తున్న ఎన్.తులసిరెడ్డి

రాజకీయాలు పక్కన పెట్టి అభివృద్ధి చూడాలి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

రాజకీయాలు పక్కన పెట్టి ఎర్రగుంట్ల నగర పంచాయతీ అభివృద్ధిని చూడాలని జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి కౌన్సిలర్లకు పిలుపునిచ్చారు. మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి అధ్యక్షతన శనివారం నిర్వహించిన అత్యవసర కౌన్సిల్ సమావేశానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో నెలకొన్న అత్యవసర సమస్యలపై దృష్టి సారించాలన్నారు. వాటిపైన సమస్యలుంటే తెలపాలని సభ్యులను కోరారు. కౌన్సిలర్ అలీ మాట్లాడుతూ రాణి వనంలో పెన్నా నది నుండి వచ్చే నీరు మూడు రోజులకు ఒకసారి మాత్రమే వదులుతున్నారని తెలిపారు. తాగునీటి పైప్‌లైన్ లీకేజీలను మున్సిపల్ వర్కర్లతో పని చేయించి మొత్తం పనులు కాంట్రాక్టర్లు చేసినట్లు చూపించి బిల్లులు దండుకుంటున్నారని కౌన్సిలర్ నాగిరెడ్డి ఆరోపించారు. కౌన్సిలర్లు పెన్నా రషీద్, భాస్కర్ పలు ఆరోపణలు చేశారు. కమిషనర్ రామకృష్ణయ్య మాట్లాడుతూ ఎలక్ట్రిక్ ఆటోల మరమ్మతులకు మెకానిక్ పూణే నుండి రావలసి ఉండడంతో ఆలస్యం అవుతుందని సభ్యులకు తెలిపారు. సమావేశం జరుగుతుండగా ఎమ్మెల్యే జాతీయ రహదారి ఇఇ భాస్కర్‌రెడ్డికి ఫోన్ చేసి రహదారిపై నిలుస్తున్న నీటి సమస్యను వివరించి, రహదారికి ఇరువైపులా డ్రయినేజీ నిర్మాణం చేపట్టాలని, ప్రస్తుతం నీరు నిలవకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎమ్మెల్యే ఆది మాట్లాడుతూ గత ఐదేళ్ల పాలనలో ఎలాంటి అభివృద్ధి లేక 20 సంవత్సరాలు వెనుకబడిందని, రాజకీయాలు పక్కన పెట్టి కలిసికట్టుగా పనిచేసే అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఎజెండాలో ఆమోదించిన పనులను నెల రోజుల్లోగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వలసపల్లి రస్తాలోని జువారి కర్మగారం వద్ద 4.9 ఎకరాల భూమిని డంపింగ్ యార్డ్ కోసం సేకరించామని, ఎన్నో ఏళ్లుగా ఉన్న సమస్య పరిష్కారం అయిందని తెలిపారు. పట్టణంలో నెలకొన్న సమస్యలను ఆయా శాఖల అధికారులకు తెలిపి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజలకు జవాబుదారీతనంగా పనిచేయాలని కౌన్సిలర్లకు సూచించారు. టెండర్ల విధానంలో పనులు ఆలస్యం అవుతాయని నామినేషన్ పద్ధతిలో పనులు త్వరగా పూర్తి అవుతాయని, దానికి కౌన్సిలర్ల ఆమోదం కావాలని ఎమ్మెల్యే కోరారు. నామినేషన్ పద్ధతిలో పనులు చేయుటకు కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. సమావేశంలో కౌన్సిలర్లు, మున్సిపల్ ఎఇ సురేష్, పబ్లిక్ హెల్త్ అధికారి చెన్నకేశవరెడ్డి, విద్యుత్ ఎడి కిరణ్, ఎఇ సుబ్బారావు, మున్సిపల్ ఆర్ఒ గంగిరెడ్డి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

ప్రజల నుంచి ఎమ్మెల్యే వినతుల స్వీకరణ

స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డికి ప్రజలు తమ సమస్యలను వినతుల రూపంలో సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరిస్తూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్యలను పరిశీలించి పరిష్కరించేలా తగు చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల ఇన్‌ఛార్జి మధుసూదన్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, మల్లు గోపాల్‌రెడ్డి, హరి ఓబుల్‌రెడ్డి పాల్గొన్నారు.

డిగ్రీ ప్రవేశాల ప్రచార పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - మైదుకూరు

డిగ్రీ ప్రథమ సంవత్సర ప్రవేశ ప్రచార పోస్టర్‌లను మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ శని వారం ఆవిష్క రిం చారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే మాట్లా డుతూ ప్రభుత్వ కళా శాలలను బలో పేతం చేయాలని సూ చించారు. మైదు కూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి నారాయణ రెడ్డి మాట్లా డుతూ డిగ్రీ కళాశాలలో స్కిల్ హబ్ ద్వారా విద్యా ర్థులకు సాఫ్ట్వేర్, సాంకేతిక విద్యపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. వైస్ ప్రిన్సిపల్ సుభాన్ సాహెబ్, రాధారావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పివి కృష్ణారెడ్డి, ఆర్ఆర్‌సి ప్రోగ్రాం ఆఫీసర్ అయ్యవారురెడ్డి, అధ్యాపకులు నరసింహారావు, చెన్న రాయుడు, సుబ్బరాయుడు, అనురాధ, లక్ష్మీ పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్

'గండి' ఎసిగా బాధ్యతలు స్వీకరించిన వెంకటసుబ్బయ్య

చక్రాయపేట : రాయలసీమలో పేరు ప్రఖ్యాతి చెందిన గండి క్షేత్రానికి ఆలయ అసిస్టెంట్ కమిషనర్‌గా శనివారం వెంకటసుబ్బయ్య బాధ్యతలు స్వీకరించారు. వీరు గతంలో నెల్లూరు టౌన్ దుర్గా మిట్టలోని రాజరాజేశ్వరి ఆలయం ఇఒగా పనిచేస్తూ బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ముకుందారెడ్డి దేవాదాయ శాఖకు రిపోర్ట్ చేయనున్నారు. బాధ్యతలు చేపట్టిన వెంకటసుబ్బయ్యకు ప్రధాన అర్చకులు కేసరి స్వామి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.

మురుగు కాలువల నిర్మాణానికి పరిశీలన

ఎర్రగుంట్ల : పట్టణంలోని కడప–తాడిపత్రి జాతీయ రహదారికి ఇరువైపులా మురుగు కాలువల నిర్మాణానికి సంబంధించి జాతీయ రహదారి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విజయభాస్కర్‌రెడ్డి పరిశీలించారు. ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ఆదేశాల మేరకు శనివారం సాయంత్రం ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి, మున్సిపల్ ఎఇ సురేష్ బాబు పాల్గొన్నారు.

ఎస్‌సి పథకాలను అమలు చేయాలి

ఎమ్మెల్యే 'ఆది', భూపేష్‌రెడ్డిని కలిసిన ఎంఆర్‌పిఎస్ నాయకులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

కూటమి ప్రభుత్వం ఎస్‌సి పథకాలను అమలు చేయాలని ఎపి ఎమ్మార్పీఎస్ నాయకులు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డిని శనివారం దేవగుడిలో కలిసి కోరారు. జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రద్దు చేసిన ఎస్‌సి పథకాలను పునరుద్ధరించి కొనసాగించాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణం ఎస్‌సి వర్గీకరణ చేపట్టేలా చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి వై.చిన్నయ్య, ఎమ్మెస్పీ జిల్లా నాయకుల సుబ్బగాళ్ళ నరసింహులు, బొంతల ఓబులేసు, రాంపుల్లయ్య, రామ చంద్రుడు, సుబ్బరాయుడు, ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ అధ్యక్షులు డి. దస్తగిరి, పట్టణ అధ్యక్షులు వెంకటసుబ్బయ్య, మైలవరం మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు ఆటో మునిస్వామి, పొన్నతోట రాయుడు, చందు, రామచంద్రుడు పాల్గొన్నారు.

Union Bank of India (A Government of India Undertaking)

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

అశోక్ నగర్, బద్వేల్ శాఖ (70260)
3/1/66/1, మొదటి అంతస్తు, నెల్లూరు రోడ్, బద్వేల్, కడప జిల్లా-516227.
సంప్రదించు నం. 9959955421.

తాకట్టుపెట్టిన బంగారు ఆభరణాల బహిరంగ వేలం కొరకు ప్రకటన

ఇందు దిగువ పేర్కొనబడిన వ్యక్తులకు ఇందుమూలంగా తెలియజేయబడుచున్నది ఏమనగా, రుణ ఖాతాలో వారు బకాయి మొత్తాలను చెల్లించుటలో విఫలం చెందారు. వారికి రిజిస్టర్డు పోస్టు ద్వారా నోటీసులు పంపబడినవి. కావున వారిని బకాయి మొత్తాలను మరియు ఇతర చార్జీలను 18.07.2024న లేదా ముందుగా చెల్లించి తాకట్టుపెట్టిన ఆస్తులను విడిపించుకోవలసిందిగా కోరబడుచున్నది, విఫలం చెందిన ఏద్దైత, సదరు సెక్యూరిటీస్‌ను 19.07.2024వతేది సాయంత్రం 4గం॥లలోపు లేదా ఏదేని ఇతర సౌకర్యవంతమైన తేదీన బ్యాంకు ఆవరణల వద్ద రుణగ్రహీత పూర్తి బాధ్యత పైననే తదుపరి నోటీసు ఇవ్వకుండానే, బ్యాంకు నిర్ణయం యూరకు, బహిరంగ వేలంలో బ్యాంకుచేత విక్రయించబడుతుంది.

క్ర.సం.	లోన్ తేది	లోన్ నంబరు	రుణగ్రహీత పేరు & చిరునామా
1	20/03/2021	702606540012521	శ్రీమతి చెన్నూరు నాగమ్మ, భర్త ప్రసాద్, ఇ.నం. 7-1-422, గాంధీనగర్, గోపవరం (మం), కడప జిల్లా-516227. ఫోన్: 9177586724
2	04/10/2021	702606540013835	

తేది: 29.06.2024 **బ్రాంచి మేనేజరు**

IN THE COURT OF THE III ADDITIONAL JUNIOR CIVIL JUDGE : KADAPA
I.A.No. 445/2022
O.S.No. 322/2019

N.Surendra Reddy
...Petitioner/Plaintiff
Vs
V.Lakshmi Eswaramma and 2 Others.
...Respondents/Defendants

NOTICE TO RESPODNET NO:2 TO 4

R2. Vallem Lakshmi Eswaramma, W/o Late V.Meheswara Reddy, Hindu aged 46 years.
R3. Vallem Kalpana, W/o C.Venkata Subba Reddy, D/o Late V.Maheswara Reddy, Hindu, aged 28 years.
R4. Vallem Raveendra Reddy, S/o Late V.Maheswara Reddy, Hindu aged 26 years all are residing at D.No.73/116-3, Guduru Harijana wada, Ramarajupalli,Kadap Ciry & Dist.

పై I.A. నందు రెస్పాండెంట్స్ నెం.2 టు 4 వారు, పై కోర్టు నందు హాజరు అగుటకు గాను 10/7/2024వ తేదీన వాయిదా వున్నది. కావున మీరు స్వయంగా గాని, లేదా వకీలు ద్వారా గాని పై కనబరచిన తేదీన ఉదయం 10.30 గంటలకు పైన తెలిపిన కోర్టు నందు హాజరు కావలెయును. లేనియెడల మీ పరోక్షంలో తీర్మానించబడును.

//By Order of the Court//
P.RAGHUNATH REDDY
Advocate for the petitioner/Plaintiff
KADAPA.

మహారాజశ్రీ 12 వ అదనపు జిల్లా కోర్టు మరియు మోటారు ఆక్సిడెంట్ క్లెయిమ్స్ ట్రిబునల్ విజయవాడ.
MVOP NO: 316/2022

Between:
మైలేపల్లి పద్మలక్ష్మి .....వాది
మరియు
1. సి. చంద్రశేఖర్ రెడ్డి S/o కొండారెడ్డి హిందూ, వయస్సు 60సం. డోర్ నెం. 9-207, రెడ్డినగర్, రంగసముద్రం రంగసా, పోరుమామిళ్ళ, కడపజిల్లా.
2. ఫ్యూచర్ జనరలీ ఇన్సూరెన్సు కం.లి. విశాఖపట్నం. .... ప్రతివాదులు

పై కేసు 5.7.24వ తేదిన వాయిదా అయి ఉన్నది. గతంలో అనేక మార్లు పైన తెలిపిన 1వ ప్రతివాది హాజరుకానందు వలన ప్రత్యామ్నాయ పద్ధతిలో ఈ పేపరు ద్వారా ప్రకటన ఇవ్వమని శ్రీ కోర్టువారు ఉత్తర్వులు ఇచ్చినారు. పై తెలిపిన 1వ ప్రతివాది 5.7.24 తేదీన ఉ.10.30 గం.లకు పై కోర్టు ముందు హాజరుకాని ఎడల వారికి ఎటువంటి వాదన లేదని భావించి శ్రీ కోర్టువారు వారిని ఎక్స్-పార్టీగా ప్రకటించెదరు. కావున తెలియపరచడమైనది.

(పై కోర్టువారి ఉత్తర్వులకు లోబడి ఈ ప్రకటన జారీ చేయటమైనది. అడ్రసు)

శ్రీ A.S.S.రాంప్రాద్
శ్రీ K.కనకయ్య. న్యాయవాదులు
FF-108,శ్రీలక్ష్మీ కాంతమ్మ ఎస్టేట్స్, గుణదల రైల్వేగేటు దగ్గర,
విజయవాడ,
29.6.2024.

అతిసారపై అవగాహన తప్పనిసరి

ప్రజాశక్తి - వేంపల్లె

అతిసార వ్యాధిపై విద్యార్థులకు తప్పక అవగాహన ఉండాలని హెల్త్ ఎడ్యుకేటర్ షఫీ ఉన్నిసా బేగం తెలిపారు. స్థానిక హరిజనవాడలోని ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థులకు అతిసార వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దోమల కాటుతో వ్యాధులు వ్యాప్తిస్తాయన్నారు. అతిసార వ్యాధి సోకిన వెంటనే ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకోవాలని సూచించారు. నిర్లక్ష్యం వహిస్తే ప్రాణానికి ప్రమాదమన్నారు. శుభ్రతను ప్రతి విద్యార్థి పాటించాలని కోరారు. ఆహారం తినే సమయంలో చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలని కోరారు. కార్యక్రమంలో సిహెచ్ఒ వెంకటరత్నం, సూపర్‌వైజర్ ఫక్రుద్దీన్, వెంకటలక్ష్మి, హెచ్ఎం గోవిందు, ఉపాధ్యాయురాలు శ్రీవాణి, సిహెచ్ఒ రాణి, ఎఎన్ఎం లక్ష్మిదేవి, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రైతులపై ప్రభుత్వానికి నిర్లక్ష్య వైఖరి తగదు

- రైతు సేవా సమితి జిల్లా అధ్యక్షులు ఎవి.రమణ

ప్రజాశక్తి - మైదుకూరు

రాష్ట్రంలో రైతులను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వానికి నిర్లక్ష్య వైఖరి తగదని రైతు సేవాసమితి కడప జిల్లా అధ్యక్షులు ఎవి రమణ పేర్కొన్నారు. మైదుకూరు పట్టణ రైతు నాయకులు రామ్మోహన్, రాజా, నాగరాజు, గుర్రప్పలతో కలిసి శనివారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో నూతన ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు ఖరీఫ్ సీజన్ మొదలైనా కూడా రైతులకు చేసే సాయం ప్రకటించకపోవడం.. రైతులపై ఉన్న నిర్లక్ష్య ధోరణి కనబడుతోందన్నారు. ఎన్నికల్లో పాల్గొన్న ప్రభుత్వ ఉద్యోగులకు ఒక నెల జీతం అందించే విషయంపై ప్రకటన చేసిన ముఖ్యమంత్రి రైతులకు సంబంధించిన ప్రకటన చేయాలని వారు కోరారు.

విజయ్‌కుమార్ సేవలు మరువలేనివి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తూ అందరి మన్ననలను పొందిన ఎంపిడిఒ కార్యాలయ పరిపాలన అధికారి (ఎఒ) విజయ్‌కుమార్ సేవలు మరువలేనివని ఎంపిడిఒ సల్మాన్ రాజ్ పేర్కొన్నారు. ఎంపిడిఒ సభా భవనంలో శనివారం విజయ్‌కుమార్ ఉద్యోగ విరమణ సన్మాన సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి విరమణ సర్వ సాధారణమన్నారు. విరమణ తర్వాత కుటుంబ సభ్యులు, బంధు వులు, స్నేహితులతో కలిసి సుఖ సంతోషంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం విజయ్‌కుమార్, పద్మావతి దంపతులను ఘనంగా సత్కరించారు. ఈఓపిఆర్డి పద్మనాభరెడ్డి, ఉపాధి హామీ చట్టం ఎపిఒ జయభారతి, ఎంపిడిఒ కార్యాలయ, సచివాలయ, ఉపాధి హామీ సిబ్బం ది పాల్గొన్నారు.

నిరాశ్రయులకు అల్పాహార పొట్లాలు

ప్రజాశక్తి - మైదుకూరు

పట్టణ పరిధిలోని ఆర్టీసీ బస్టాండ్, ఆలయాల వద్ద ఉన్న నిరాశ్రయులు, బాటసారులు, వృద్ధులు, సాధువులకు శనివారం అల్పాహార పొట్లాలను అమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఖాజీపేట మండలం మూలవారిపల్లె గ్రామానికి చెందిన ఇల్లూరు రామమోహన్‌రెడ్డి, గంగాదేవి కుమార్తె రామసాత్విక రెడ్డి జన్మదిన సందర్భంగా అల్పాహార పొట్లాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాగ్దాడం శివశంకర్, ఇల్లూరు రామ మోహన్‌రెడ్డి, అక్షర ట్యూషన్ సెంటర్ నిర్వాహకులు దేవగుడి విజయ్ పాల్గొన్నారు.

6,166 పింఛన్ల పంపిణీకి చర్యలు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని 15 సచివాలయాల పరిధిలో అన్నిరకాల పెన్షన్లు కలిపి 6,166 ఉన్నాయని, వీటిని సోమవారం పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టామని ఎంపిడిఒ రహంతుల్లయ్య తెలిపారు. లబ్ధిదారులకు ఇంటి వద్ద పంపిణీ చేస్తామన్నారు. రూ.4.13కోట్లు పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్‌లకు చెక్కులు అందించామని తెలిపారు. సచివాలయ సిబ్బంది 147 మందికి పెన్షన్లు పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు.

హాస్టల్‌ను ఏర్పాటు చేయండి

వేంపల్లె : ఇంటర్ విద్యార్థులకు ప్రభుత్వం తరుపున హాస్టల్‌ను ఏర్పాటు చేయాలని ఉపాధ్యాయులు కోరారు. శనివారం వేంపల్లెకు విచ్చేసిన టిడిపి మండల పరిశీలకుడు రఘునాథ్‌రెడ్డికి హాస్టల్ ఏర్పాటుపై వినతిపత్రం అందజేశారు. వేంపల్లెలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు 6, ప్రయివేటు పాఠశాలలు 13 ఉన్నాయన్నారు. బాలికలకు హాస్టల్ లేకపోవడంతో ప్రభుత్వ కళాశాలల్లో వారు చేరడం లేదని తెలిపారు. బాలికల వసతి గృహం ఏర్పాటు చేసేందుకు ముఖ్యమంత్రి, పులివెందుల ఇన్‌ఛార్జి బిటెక్ రవీంద్రనాథ్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఏర్పాటు చేయాలని కోరారు. ఇందుకు స్పందించిన రఘునాథ్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు.

రాజీ కావడంతో శాంతియుత జీవితం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ఎన్నో ఏళ్లుగా వివిధ కారణాల వల్ల పెండింగ్‌లో ఉన్న కేసులన్నీ రాజమార్గంలోని లోక్ అదాలత్ ద్వారా రాజీ చేసుకోవడంతోనే శాంతి యుతమైన జీవితం సాధ్యమవుతుందని జమ్మలమడుగు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి భార్గవి అన్నారు. స్థానిక జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఆవరణలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి భార్గవి మాట్లాడుతూ చాలా మంది కక్షిదారులు కేసులు ఏళ్ల తరబడి నడుస్తున్న కేసులతో తమకు న్యాయం జరగడం లేదని బాధపడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ లక్ష్మయ్య, ఏపీపీ వీరాంజనేయులు, ఏజీపీ జాకీర్ హుస్సేన్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు దేవగుడి నారాయణరెడ్డి, సెక్రటరీ మురళీధర్‌రెడ్డి, సీనియర్ న్యాయవాదులు భాస్కర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రామమోహన్, సూర్య పెద్దిరాజు, ఓబులేసు, నాగార్జునరెడ్డి, సుబ్బారావు, జయన్న, కొత్తమాస్ భాస్కర్ బాబు, అక్షయరెడ్డి, మహేశ్వరి, కక్షిదారులు పాల్గొన్నారు.

ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024

ఎంట్రీలకు ఆహ్వానం

ప్రియమైన మిత్రులారా!

ప్రజాశక్తి దిన పత్రిక వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు స్మృత్యర్థం పాత్రికేయ రంగంలో ఉత్తమ కృషి చేసిన జర్నలిస్టులను సత్కరించేందుకు ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డును నెలకొల్పి రెండు దశాబ్దాలు దాటింది. కోవిడ్ కాలం మినహా ప్రతి యేటా క్రమం తప్పకుండా ఈ పురస్కారాన్ని ప్రజాశక్తి సాహితీ సంస్థ అందజేస్తూ వస్తున్నది. 2024 సంవత్సరానికి ఉత్తమ జర్నలిస్టు అవార్డు కోసం ఎంట్రీలను ఆహ్వానిస్తున్నది. సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి అధ్యక్షతన నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసర్ జి అనిత, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావుతో కూడిన త్రిసభ్య కమిటీ ఈ ఏడాది అవార్డు కోసం ఏదేని అంశంపై మానవాసక్తికర వార్తా కథనాలను ఎంట్రీలుగా ఆహ్వానించాలని నిర్ణయించింది. 2023 మే 1నుంచి 2024 జూన్ 18వ తేదీ వరకు తెలుగు దిన పత్రికల్లో ప్రచురితమైన మానవాసక్తికర కథనాలను మాత్రమే పంపాలి. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన జర్నలిస్టులు ఎంట్రీలు పంపవచ్చు. ఎంట్రీతోపాటు ఇది నా సొంత రచన, ఎవరినీ అనుకరించినది కాదు అని స్వీయ ధ్రువీకరణ పత్రం జతచేసి పంపాలి. ఒక వ్యక్తి రెండు కథనాలకు మించి పంపకూడదు. తమ దృష్టికి వచ్చిన ఇతరుల కథనాలను ఎవరైనా సూచించవచ్చు కూడా. ప్రజాశక్తి సంస్థ జర్నలిస్టులు ఈ విభాగంలో పంపనవసరం లేదు. ఎంట్రీలు 2024 జులై 18 నాటికల్లా మాకు అందేట్లు చూడాలి. కవర్‌పై 'ఎం హెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు–2024 కోసం' అని స్పష్టంగా పేర్కొనాలి. ఇ-మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు. అవార్డు విజేతకు 2024 ఆగస్టులో జరిగే ఎంహెచ్ స్మారకోపన్యాస సభలో జ్ఞాపిక, రూ.10 వేలు నగదు ఇచ్చి సముచిత రీతిలో సత్కరించడం జరుగుతుంది.

ఎంట్రీలు పంపాల్సిన చిరునామా

ప్రజాశక్తి సాహితీ సంస్థ,
ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ,
తాడేపల్లి, గుంటూరు జిల్లా,
పిన్‌కోడ్-522501, ఇ మెయిల్
అడ్రస్: psmhaward@gmail.com

కార్యదర్శి
(ఎంవిఎస్ శర్మ)
ప్రజాశక్తి సాహితీ సంస్థ